# భయం-భక్తి

అర్బిల్ నుంచి బాగ్దాద్ వెళ్ళే బస్సులతో కుర్దిస్తాన్ స్క్వేర్‌లో ఉన్న బస్సు స్టాండు నిండి ఉంది. మహ్మూద్ కారు పార్క్ చేశాడు. కారులోంచి శ్రీనివాసరావు దిగాడు. ఆ దిగడంలో తొట్రుపాటూ,' బెదురూ ఉన్నాయి. అతను సాయంత్రానికి బాగ్దాద్ చేరగలడో లేడోనని భయపడ్తున్నాడు. వెళ్తే అక్కడ నుంచి బొంబాయి వెళ్ళే విమానం ఆరోజు బయలు దేర్తుందో లేదో అనుమానం. ఒకసారి వెంకటేశ్వరస్వామికి మనస్సులో దండం పెట్టుకొన్నాడు. దార్లో యూనివర్శిటీ ఆఫీసు పక్కనున్న మసీద్ కనిపిస్తే ఏవిధంగా ప్రార్థిస్తే, అల్లా పలుకుతాడో తెలియకపోయినా, అల్లాని తనకి తెలిసిన విధంలో ప్రార్థించాడు.

శ్రీనివాసరావునక్కడే నిలబడమని మహమూద్ బస్సు స్టాండంతా కలయ దిరిగి తెలిసిన డ్రైవర్‌ని పట్టుకొని శ్రీనివాసరావుని బాగ్దాద్ జాగ్రత్తగా చేర్చమని చెప్పాడు.

"ఆ డ్రైవర్ పూర్వం మన యూనివర్శిటీలో డ్రైవర్‌గా ఉండేవాడు. తెలిసినవాడు. అతనికి అన్నీ చెప్పాను. మనం సామాను ఎక్కిద్దాం." అంటూ మహమూద్ సగం శ్రీనివాసరావు సామాన్లు చేతిలోకి తీసుకొన్నాడు. శ్రీనివాసరావు మిగిలిన సగం చేతిలోకి తీసుకొన్నాడు.

ఇద్దరూ కలిసి బస్సు కింద భాగంలో ఉన్న అరల్లో సామాన్లు పెట్టారు. డ్రైవర్ దానికి తాళం పెట్టాడు. బాగ్దాద్ వెళ్ళే బస్సులు ఏ వరుసలో వచ్చాయో ఆ వరుసలోనే వెళ్తాయి .దేనికీ నిర్ణీతమైన టైము లేదు. నిండగానే బయల్దేరటమే. శ్రీనివాసరావు సామాన్లు పెట్టిన బస్సు, క్రమంలో అయిదోది. అప్పుడుదయం తొమ్మిదిగంటలైంది. కనీసం బస్సు పదకొండు గంటలకైనా బయిల్దేరక పోదు. మహమూద్ సెలవు తీసుకొన్నాడు. శ్రీనివాసరావు ఒంటరివాడై పోయాడు.

శ్రీనివాసరావు కాకుండా ఆరోజు మరో ఇద్దరు బాగ్దాద్ నుంచి అదే విమానంలో బొంబాయి వెళ్తున్నారు. అందులో శివస్వామి తెలుగువాడే "కల్సే వెళ్దాం" అన్నాడు శ్రీనివాసరావుతో. శ్రీనివాసరావు "మనం కల్సిరాలేదు కలిసి వెళ్లడం ఎందుకు?" అన్నాడు. శివస్వామి అసలే నాస్తికుడు. ఇనుముతో ఉన్న నిప్పుకి సమ్మెట పోట్లు తప్పవు. అతని దురదృష్టం తనకి అంటుకొంటుంది అనుకొన్నాడు శ్రీనివాసరావు.

జీతంలో సగం ఇరాకీప్రభుత్వం ఇండియా తీసుకు వెళ్ళనిస్తుంది. ఆ డబ్బు డాలర్లలోకి మార్చుకోడానికి ఎంతశ్రమ పడవలసి వచ్చింది! బుధవారం రఫీదియాన్ బ్యాంక్‌కి శివస్వామితో కలసి వెళ్ళాడు, ఏమైంది? పని ఏమీ కాలేదు! సరిగ్గా పదిహేనురోజులక్రితం హఠాత్తుగా మోసుల్ వెళ్ళి అనుమతి తెచ్చుకొంటేగాని డాలర్లు ఇవ్వమన్నారు. మోసుల్‌లో ఫారిన్ ఎక్చేంజి వారు అప్లికేషన్ తీసుకొని అనుమతి పత్రం అర్బిల్‌కి తామే పంపిస్తామన్నారు. ఇరాకీ ఎయిర్ లైన్సువారు "వెయిటింగ్ లిస్టులో పెట్టాం నీపేరు" అన్నారు. అప్పుడు తను శివస్వామితో మోసుల్ వెళ్ళాడు. క్రితం రోజు శుక్రవారం సెలవుదినం. అదృష్టంకొద్దీ గురువారం నాటికి ఏర్‌లైన్సు సీట్ కన్‌ఫర్మ్ చేసింది. బ్యాంకు డాలర్లు ఇచ్చింది. అప్పుడు శ్రీనివాసరావు శివస్వామి లేకుండా ఒక్కడే వెళ్ళి అదృష్టాన్ని పరీక్షించుకొన్నాడు. మిగిలిన దీనార్లతో బంగారపు గొలుసు కొన్నాడు. శ్రీనివాసరావు మెడ తడుముకొన్నాడు. గొలుసు త్రీపీస్ సూట్ లో చొక్కా క్రింద క్షేమంగా ఉంది. చొక్కామీద ఉన్నటై దాన్ని చేతుల స్పర్శకి సులభంగా తెలియకుండా దాచి ఉంచింది. శ్రీనివాసరావు కనకధారాస్తవం చెయ్యగా చెయ్యగా ఇరాక్ రాగలిగాడు. ఇరాక్‌లో ఉన్నన్ని రోజులు దాన్ని దీక్షగా పఠించాడు. అందుకనే ఇరాక్ యుద్ధంలో మునిగి ఉన్నా డబ్బు ఇండియాకి తీసుకు వెళ్ళడం సాధ్యమౌతోంది. భార్యతో రమారమి అరవై వేలు పంపించాడు. ఇప్పుడు మరో అరవై వేలు తను తీసుకు వెళ్తున్నాడు. లక్షపైగా ఒక సంవత్సరంలో దాచడం మాటలా! దైవానుగ్రహం ఉంటే తప్పించి!

1987 వ సంవత్సరం జూన్ నెల చివరికి వచ్చేసింది. రోజూ ఉష్ణోగ్రత మధ్యాహ్నం 45సెల్షియస్ దాకా ఉంటోంది. శ్రీనివాసరావు ఎన్నో పొరలున్న దుస్తులు వేసుకొన్నా గాలిలో

తేమలేకపోడం వల్ల ఇబ్బందిగా లేదు. పది గంటలైంది. రెండో బస్సు బయల్దేరటానికి సిద్ధంగా ఉంది. డాక్టర్ మిశ్రా కుటుంబంతో వచ్చి హడావిడిగా సామాన్లని కుటుంబాన్ని మూడో బస్సులో ఎక్కించాడు. మూడోది నిండితే గాని బయల్దేరదు. శ్రీనివాసరావు మిశ్రాని దూరం నుంచే పోల్చుకొని బయల్దేరడానికి సిద్ధంగా ఉన్న బస్సు చాటుకి తప్పుకొన్నాడు. అయితే అది వెంటనే బయల్దేరి శ్రీనివాసరావుకి మరుగు లేకుండా చేసింది. శ్రీనివాసరావు, మిశ్రా భార్య కళ్ల బడ్డాడు, 'భాయి సాబ్'ని ఆమె భర్తకి చూపించింది. అతను వెంటనే "శ్రీనివాస్" అని పిలుస్తూ బస్సు దిగాడు. శ్రీనివాసరావుకి తప్పలేదు. మిశ్రా చాచిన చెయ్యిని కుదిపాడు.

'బాభి, పిల్లలు ఎల్లా ఉన్నారు' అన్ని సమస్యలూ తీరాయా?" అని అడిగాడు.

సరిగ్గా ఆ ప్రశ్ననే శ్రీనివాసరావు తప్పించుకోవాలని ప్రయత్నించాడు, మిశ్రాకి కనపడక తప్పలేదు. అతను ఆ ప్రశ్న అడగకా మానలేదు. శ్రీనివాసరావు ఓ ఇబ్బంది నవ్వు నవ్వి "బాగానే ఉన్నారు" అన్నాడు సమస్య తీరిందో లేదో చెప్పలేదు.

"మీరూ మా బస్సులోనే వస్తున్నారా?"

"లేదు,ఆ తరువాత బస్సులో వస్తున్నాను".

"చోటుందికదా ఇందులో రాకూడదా?"

"ఇంకో దాంట్లో సామాను పెట్టాను. పైగా కొద్దిగా వేరే పనుంది" అని శ్రీనివాసరావు చిన్న అబద్ధం ఆడాడు. నిజానికి మహమూద్‌కి తెలిసినవాడి బస్సులో వెళ్లటం వల్ల పెద్దగా ఒరిగేదేమి ఉండదని తెలిసినా అతనికి మిశ్రాతో పాటు ప్రయాణం చేయటం ఇష్టం లేదు.

డాక్టర్ మిశ్రా ఉన్నంతసేపు శ్రీనివాసరావు ముళ్ల మీద నిల్చున్నట్టే నిల్చున్నాడు. మూడో బస్సు పదకొండయ్యే సరికి కదిలింది. శ్రీనివాసరావు తన ఆలోచనల తోడుగా మిగిలిపోయాడు. డాక్టర్ మిశ్రా ఇండియాలో మళ్లా తనకి ఎక్కడా తగల కూడదని కోరుకున్నాడు. సరిగ్గా ఆరు నెలల క్రితం అతనితో పరిచయం కోసం శ్రీనివాసరావు తహతహలాడాడు. అప్పటికి ఇప్పటికి ఎంతో తేడా వుంది పరిస్థితుల్లో. అప్పుడూ శ్రీనివాసరావు భయపడ్డాడు. ఇప్పుడూ శ్రీనివాసరావు భయం పడ్తున్నాడు. అప్పుడు భయనివారణకి డాక్టర్ మిశ్రా సాయం కోరాడు. అదే మిశ్రా ఇప్పుడు భయకారణం.

శ్రీనివాసరావు సెప్టెంబర్‌లో ఇరాక్ వచ్చాడు. అతను బొంబాయిలో విమానం ఎక్కుతున్నప్పుడు అతని భార్య, కొడుకు గట్టిగా చెప్పారు. ఇరాక్ వెళ్లగానే తమని తీసుకు వెళ్లే ప్రయత్నం చెయ్యమని. శ్రీనివాసరావు అమెరికాలో పిహెచ్.డి. చెయ్యటానికి వెళ్లినప్పుడు పెళ్లాన్ని, పసివాడైనా కొడుకుని ఇండియాలో వదిలిపెట్టి వెళ్లాడు. పిహెచ్.డి. చెయ్యటానికి అయిదేళ్లు పట్టింది. ఈసారి ఇరాక్ వెళ్లి ఎన్ని సంవత్సరాలుండిపోతాడో అన్న భయం కొద్దీను, విదేశాలు చూడాలనే సరదా కొద్దీను వాళ్లు శ్రీనివాసరావు కావిషయం ఉత్తరాల్లో ప్రతీ వారం గుర్తు చేయ సాగారు. అయితే శ్రీనివాసరావు కొడుకు తొమ్మిదోక్లాసు చదువుతూ ఉండటం చేత వేసంగి వరకు ఆగితే కాని ఎక్కువ రోజులుండటానికి వీలవదు. డిసెంబరు సెలవలకి వస్తే వెంటనే వెళ్లి పోవాలి. తండ్రి తోనో, భర్తతోనో ఉండిపోడానికి వచ్చే **వారికి** మాత్రమే

యూనివర్సిటీ ఎయిర్ టికెట్స్ ఇస్తుంది. అదీ సమస్య. శ్రీనివాసరావు తన భార్యా పుత్రులు తనతో ఉండటానికి వస్తున్నారని చెప్పి టిక్కెట్లిప్పించుకొని వాళ్లని డిసెంబర్‌లో రప్పించుకొన్నాడు.

సంక్రాంతి వెళ్లగానే ఇండియన్ డాక్టర్లతో కోరి పరిచయం పెంచుకొన్నాడు. అందరి లోకి డాక్టర్ మిశ్రా కాస్త స్నేహశీలిగాను ఉపకారబుద్ధి ఉన్నవాడుగాను కనిపించాడు. అతన్ని అతని కుటుంబాన్ని భోజనానికి పిలిచాడు.

"మీ వాడు సంవత్సరం మధ్యలో వచ్చాడు కదా! చదువు పాడవదా?" అని డాక్టర్ మిశ్రా అడిగాడు.

శ్రీనివాసరావుకి సరిగ్గా కావాల్సింది అదే! తన గోడు చెప్పుకొన్నాడు. తన మాట వినకుండా కొడుకు వచ్చాడని కొడుకుని స్వంత ఖర్చు మీద వెనక్కి పంపడానికి తనవద్ద డబ్బు లేదని అల్లా అని డబ్బు సమకూడేంత వరకు కొడుకు ఇక్కడే వుంటే చదువు పాడవుతుందని శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశాడు.

"యూనివర్సిటీ ఖర్చులో పంపాలంటే హెల్తుగ్రౌండ్స్‌లోనే పంపాలి లేకపోతే మీ ఉద్యోగం పూర్తయ్యే వరకు ఇక్కడుంటే అప్పుడు యూనివర్సిటీ టిక్కెట్లిస్తుంది". అన్నాడు డాక్టర్ మిశ్రా. అనుకొన్న దారిలోకి డాక్టర్ మిశ్రా రాగానే.

"అవునా! మావాడికి ఈ వెదర్ పడటం లేదు. డస్ట్ ఎలర్జీ ఉంది, ఆ కారణం సరిపోతుందా?" అని అడిగాడు శ్రీనివాసరావు. మిశ్రా సరిపోతుందని, మర్నాడు ఆసుపత్రికి వస్తే పరీక్షించి సర్టిఫికెట్ ఇస్తానని చెప్పాడు.

మిశ్రా దయ వల్ల శ్రీనివాసరావు కొడుకును యూనివర్సిటీ ఖర్చుమీద వెనక్కి పంపాడు. శ్రీనావాసరావు పథకం పారింది.

అతనికి,' భార్యకి హద్దులేని ఏకాంతం, దొరికింది ఎన్నో సంవత్సరాల తరువాత. పైగా కొడుకు వెళ్లి పోయేసరికి ఇరాన్ అర్బిల్ మీద బాంబులు వెయ్యటం మొదలు పెట్టింది. శ్రీనివాసరావు భార్య సైరన్ల కూతలకి, విమానాల రొదలకి బాంబుల ధన్ ధనలకి, ఉంటున్న ఇల్లు అదురుడికి విపరీతంగా భయపడి పోతూ అతన్ని కరుచుకుపోయేది. ఇరాన్ ప్లేను కూలిపోయాక బాంబులు పడటం తగ్గిపోయింది కాని కుర్దీల తిరుగుబాటు తీవ్రరూపం దాల్చింది. రాత్రంతా వాళ్ల కళ్ల ముందు దీపావళి బాణసంచాలాగా తుపాకుల తూటా వెలుగులు, చెవులకి శబ్దాలు, హద్దులేని ఏకాంతం, యుద్ధం భయం, భీభత్సం ఆలుమగలని అనేక సార్లు ఏకం చేశాయి. శ్రీనివాసరావు వస్తూ ఒక్కడే వచ్చిన కారణం చేత (నిరోధ్‌లు) ఏమీ తెచ్చుకోలేదు. ఎదిగిన కొడుకుతో ఇరాక్ వచ్చిన అతని భార్యా తేలేదు. ఇరాక్‌లో దొరకక పోతాయా అనుకొంది. అయినా అది శ్రీనివాసరావుకి సంబంధించిన శాఖ ఇండియాలో. అవి ఇరాక్‌లో దొరకకపోయాయి. యుద్ధంలో జన నష్టం విపరీతంగా ఉండటంవల్ల తప్పని సరి ఆరోగ్యపరిస్థితుల్లో తప్ప గర్భవిచ్ఛేదన దండనార్హమైన నేరంగా ప్రభుత్వం పరిగణిస్తుంది ప్రతీసంతానానికి ప్రభుత్వం అధికభత్యం ఇస్తుంది. కొందరికి జీతం కంటే ఈ సంతానభత్యమే

ఎక్కువగ ముడ్తుంది. అటువంటి దేశంలో శ్రీనివాసరావు భార్య గర్భం దాల్చింది. అప్పుడు శ్రీనివాసరావుకి తప్పనిసరై మళ్లీ డాక్టర్ మిశ్రా సహాయం కావల్సి వచ్చింది. శ్రీనివాసరావు భార్య ఆరోగ్యవంతురాలవటం వల్ల గర్భస్రావం చెయ్యటానికి ఆరోగ్యశాఖ అనుమతివ్వలేదు. శ్రీనివాసరావు తన భార్య ఆరోగ్యం సరిగా లేదంటూ చేసిన వాదనను అంగీకరించక మరీ ఆలస్యం చేస్తే పొట్ట పెరిగి దాచటం కష్ట మౌతుందని శ్రీనివాసరావు మేనెల మొదట్లో నే భార్యని పంపించేశాడు. యూనివర్సిటీకి "నా భార్య కొద్ది నెలలకి ఇండియా వెళ్తోంది. మీరు టిక్కెటివ్వండి. పైసారి ఆమె వచ్చి వెళ్లటానికి అయ్యే ఖర్చు నేను పెట్టుకొంటాను అని హామీ ఇస్తున్నాను" అని హామీ వ్రాసిచ్చి ఆమెను అర్జెంటుగా ఇండియా పంపించి అక్కడ గర్భస్రావం జరిపేలా చేశాడు. శ్రీనివాసరావు భార్య కడుపుతో ఉన్న విషయం మిశ్రాకి తెలుసుగాని ఇంకెవరికి అంటే అర్బిల్‌లో వున్న ఇండియన్స్‌కి తెలియదు. అందుకని శ్రీనివాసరావు, తన భార్య వెళ్లిపోయాక యూనివర్సిటీలో ఉద్యోగం ముగిసి తను వెళ్లిపోతున్న ఆరోజు వరకు మిశ్రా తారస పడే అవకాశం ఉన్న అన్ని స్థలాలకి వెళ్లటం మానుకొన్నాడు. నలభై అయిదేళ్ల భార్య మళ్ళీ గర్భం దాల్చటం, యాభై ఏళ్ల తను మళ్లీ తండ్రికాబోవడం, సిగ్గుపడాల్సిన విషయంగా భావించి అది ఎవరికి తెలియకూడదని కోరుకొన్నాడు. తెలిసిన డాక్టర్ మిశ్రా కుటుంబాన్ని తప్పించుకొని తిరిగాడు.

శివస్వామి వచ్చాడు. నాలుగో బస్సులో ఎక్కాడు. అతన్తో తను తరువాతి బస్సులో వస్తున్నట్టు చెప్పాడు శ్రీనివాసరావు.

"మంచిది" అన్నాడు శివస్వామి.

బస్సుస్టాండులో షెల్టర్ లేదు. ఎడారి నీడలో వేడి తక్కువ ఉండదు. ఒక వేళ ఉండినా శ్రీనివాసరావుకి విపరీతంగా దాహంవేసింది. పెప్సీ కొనుక్కుని తాగాడు. దాంతో దాహం తీరక పోగా ఎక్కువైంది, కుర్దీ పిల్లవాడు మంచుగడ్డలు వేసిన నీళ్ళు అమ్ముతూ కనిపించాడు. మగ వాళ్లందరు ఎక్కువగా యుద్ధానికి పోవటంవల్ల, ఇరాక్‌లో స్త్రీలు పిల్లలు వృద్ధులు కష్టపడి పని చేస్తూ ఉండటం మామూలే. ఆ కుర్రవాడమ్ముతున్న నీళ్లు తాగటం శ్రీనివాసరావు కిష్టంలేదు.

"ఇరాక్ వెళ్తున్నావు, తురకలకి ఎంగిలిపట్టింపు లేదు జాగ్రత్త" అని అతని బంధువు లంతా అతను ఇరాక్ వెళ్తున్నాడని తెలిసినప్పుడు శ్రీనివాసరావుని ఆటలు పట్టించారు. ఇంతవరకు టీ, మజ్జిగ మొదలైన వాటిలో ఎంగిలి పట్టింపు వదిలిపెట్టినా మంచి నీళ్ల విషయంలో పట్టింపు వదిలిపెట్ట లేక పోయాడు. బస్సుస్టాండు ఊడుస్తున్న అమ్మాయి పాతిక ఫిల్స్ (దినార్లో నలభయ్యో భాగం) ఇచ్చి మంచి నీళ్లు అల్యూమినియం బొచ్చెతో తీసుకొని కరిచి పెట్టుకొని తాగింది శ్రీనివాసరావు చూస్తుండగా. ఆమె తాగాక ఆ బొచ్చెనే ఆ కుర్రాడు బక్కెట్టులో ముంచి నీరు నిండా తీసి శ్రీనివాసరావు దగ్గరకి వచ్చి కావాలా అని అడిగాడు. శ్రీనివాసరావు వద్దన్నాడు. కాని ఆ కుర్రాడు శ్రీనివాసరావుని వదలక "నీకు అమితాబ్ (బచన్)

తెలుసా, "హేమామా (లిని) తెల్సా" అని విసిగించ జొచ్చాడు. కుర్దీలు సాధారణంగా తమని హింద్ దేశ వాసుల బంధువుల మనుకొంటారు. "మీరూ, మేమూ కూడా ఆరీ (ఆర్యు) లమే"' అని చెప్తారు. కుర్దీ అంకెలు అన్నీ సంస్కృతంవే. తల్లిని 'దాయి' అని పిలుస్తారు. వాళ్లు తనని తమ వాడిగాఅనుకొన్నంత దగ్గరగా శ్రీనివాసరావు వాళ్లని అనుకోలేకపోయాడు. మతం వల్ల. ఆ కుర్రవాడు విసిగిస్తూనే ఉన్నాడు. ఎదురుగా బొచ్చెలో చల్లని నీళ్లు. శ్రీనివాసరావు దాహం పెరిగిపోయింది. డాక్టర్ మిశ్రా మామూలుగా కబుర్లలో "కుర్దీల దగ్గర జబ్బులేం ఉంటాయి నా మొహం. మహా అయితే గొంతునొప్పి అంటుకోవాలి వాళ్లనుంచి" అని అనేవాడు. అతనికి ఆ విషయం గుర్తుకు వచ్చిందిప్పుడు. శ్రీనివాసరావు ఎంగిలి పట్టింపు విడిచిపెట్టి మంచినీళ్లు తాగాడు. అప్పటికీ పన్నెండున్నర అయింది టైము.

అతని సామాన్లు పెట్టిన బస్సుడ్రైవరు ఛాన్సు తరువాతది అనుకొంటుంటే కాదని మధ్యలో మరో బస్సుందని తేలింది. శ్రీనివాసరావుకి కంగారు మొదలైంది. ఆ బస్సులోంచి సామాను తీసి రెడీగా ఉన్న బస్సులో ఎక్కించేలోపల రెడీగా ఉన్న బస్సు నిండిపోయింది.

"కిర్ కుక్ రెండున్నర లోపల దాట్తామా?" అని భయంగా అడిగాడు ఆ పాత యూనివర్సిటీ డ్రైవర్ని.

"నాది బాధ్యత" అన్నాడతను. ఫారినర్స్‌ని రెండున్నర తర్వాత కిర్ కుక్‌లో బాగ్దాద్ వైపు వదలరు. ఆ రాత్రి అక్కడ హోటల్లో ఉండి పోవాల్సిందే. ఈ శనివారం విమానం మిస్సయితే మళ్లీ శనివారం దాకా విమానం లేదు. అందులోమళ్లీ చోటుండక పోవచ్చు.

శ్రీనివాసరావు బస్సు ఒంటి గంటంపావుకి బయల్దేరింది. ఎయిర్ కండిషన్డ్ బస్సు అవటం వల్ల ప్రాణానికి హాయిగా ఉంది. "ఏడు కొండలవాడా! మక్కా మదీనా వాడా! మా బస్సు కిర్‌కుక్ దాటేలా చూడు! కాదు కాదుబస్సెలాగోదాట్తుంది. నాతో దాటేలా చూడు బాబూ!" అని దండం పెట్టుకొన్నాడు మనసులో.

దార్లో యూనివర్సిటీ ఆఫీసు, ఇంజినీరింగ్ కాలేజీ బస్సుదాటింది. బస్సులకి కండక్టర్లుండరు. వెనకవాళ్లు ముందరవాళ్ల చేతులకి తమ టిక్కెట్టు మొత్తం చెల్లిస్తారు. అది డ్రైవరు దగ్గరకు వెళ్లగానే అతను ఎవరికి రావలసిన చిల్లర వాళ్లకి అందజేస్తాడు. ముందు ప్రయాణీకుడు, "నీ సామాన్లకి మరో దీనారు ఇమ్మంటున్నాడు డ్రైవరు" అని చెప్పి శ్రీనివాసరావు దగ్గర తీసుకొని డ్రైవర్‌కి అందజేశాడు.

రెండుంపావుకి కిర్‌కుక్ ఆయిల్‌రెఫైనరీ కనిపించింది. "అమ్మయ్య" అనుకొన్నాడు. శ్రీనివాసరావు కిర్‌కుక్ జేరబోతూ, చెక్‌పోస్టు దాటగానే.

బస్సు కిర్‌కుక్ లో ఆగింది. శ్రీనివాసరావు దిగి మజ్జిగ తాగాడు.

శ్రీనివాసరావు ఒకటిన్నర నెలల క్రితం తను కిర్‌కుక్ రావటం గుర్తుకి వచ్చింది. శ్రీనివాసరావు భార్య ఇండియా తిరిగివెళ్లిపోయాక ఒక గురువారం శ్రీనివాసరావుకి పి.జి.విద్యార్థి

షాహీన్ కిర్‌కుక్ వచ్చి తనతో గడప వలసిందిగా శ్రీనివాసరావుని కోరాడు. కిర్‌కుక్‌లో ఆయిల్‌రిఫైనరీస్ చూపించటానికి తనకి అధికారం లేదని. కాని తాను ఇరిగేషన్‌డిపార్ట్‌మెంట్‌లో పనిచేయటం వల్ల ఆ కెనాల్ సిస్టమ్ అంతా చూపిస్తానని చెప్పాడు. విదేశీయుల కదలికల మీద చాలా ఆంక్షలుండటం చేత, వచ్చిన అవకాశం శ్రీనివాసరావు వదులుకోదల్చుకోలేదు. కాని ఎంగిలి పట్టింపు! అన్నం వండగానే అతనికి పెట్టేది విడిగా పెట్టాలని చెప్పాడు. షాహీన్ కి అర్థంకాక పోయినా సరేనన్నాడు. అతను ఎమ్మెస్సీ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్‌కి గైడుగా శ్రీనివాసరావుని ఎన్నుకొన్నాడు.

అనుకొన్న విధంగా ఒక గురువారం పొద్దున్న కాలేజీలో పని ముగియగానే ఇద్దరూ షాహీన్ కార్లో కిర్‌కుక్ బయల్దేరారు. దార్లో చాలా చోట్ల సిపాయిలు కారాపి షాహీన్‌ని ప్రశ్నించారు."నా ఉస్తాద్, కులియెట్ హందసా (ఇంజనీరింగ్ కాలేజీ) లో పనిచేస్తున్నారు అని చెప్పి తన ఐ.డి. కార్డు చూపిస్తూ వచ్చాడు. సిపాయిలు శ్రీనివాసరావుకి గౌరవంగా సలాములు పెట్టారు.

"కుర్దీలు విదేశీయుల్ని అపహరించి ప్రభుత్వానికి దొరికిన తిరుగుబాటు దార్లని ప్రభుత్వం విడిచి పెట్టే పక్షంలో తాము వారిని విడిచి పెడ్తామని బేరాలు పెడ్తారు. అందుకని విదేశీయులు ప్రమాదాల్లో పడకుండా ప్రభుత్వం ఈ జాగ్రత్తలు తీసుకొంటుంది" అన్నాడు షాహీన్.

శ్రీనివాసరావుకి తెల్సు . ఒకసారి శివస్వామి అర్ధరాత్రిదాకా ఊళ్లో స్నేహితుల్ని చూసి టాక్సీలో వస్తుంటే పోలీసుల కారు అనుసరించి వచ్చి అల్లా రాత్రి పూట తిరగవద్దని హెచ్చరించారు. శ్రీనివాసరావు అందుకని చీకటి పడ్డాక ఎప్పుడూ బయట తిరగలేదు.

టైగ్రస్ నది నుంచి తవ్విన పంట కాల్వలు ఎంతో ఆహ్లాదంగా ఉన్నాయి. అయితే ఇరాన్‌తో యుద్ధం రావటం వల్ల ప్రాజెక్టు పూర్తి కాలేదు. పూర్తికాని భవనాలెన్నో ఇరాక్‌లో అదే కారణంగా, ఇంజినీరింగ్ కాలేజీకి ఎదురుగానే ఉంది, అటువంటి భవనం ఒకటి.

ప్రాజెక్టు చూసుకొని షాహీన్ ఇంటికి వెళ్లారు. అతను అతని భార్య ఖజల్‌ని పరిచయం చేశాడు. ఆమె ఆదరంగా చెయ్యి చాపి కరచాలనం చేసింది. ఇరాక్‌లో అరబ్బు, కుర్దీ స్త్రీలు మగవారితో కరచాలనం చేయటం సామాన్య విషయమే.

అందుకని శ్రీనివాసరావు మొదట్లో ఆశ్చర్యపడినా, అలవాటు పడిపోయాడు ఆతరువాత. తన రెండు సంవత్సరాల కూతురు 'రోజ్‌నీ'ను షాహీన్ చూపించాడు. ఆపిల్ల చాలా ముద్దుగా ఉంది. అతనిల్లు ఉన్న ప్రాంతం శుభ్రంగా ఉంది.

టీ తాగాక, శ్రీనివాసరావు నడిచి ఊరు చూద్దామన్నాడు. షాహీన్ ఆ ఊరి రోడ్లన్నీ తిప్పాడు. ఆ ఊరు ఇండియాలో ఓ చిన్న పట్టణంలాగా ఇరుకుగా మురికిగా ఉంది. షాహీన్ మధ్య మధ్యలో ఆగి స్నేహితులను కౌగిలించుకొంటూ ముందుకు సాగాడు. ఒక కారు పక్కన

ఆగి అందులోని వయస్సు మళ్ళిన వ్యక్తితో కొద్దిసేపు మాట్లాడి వచ్చి శ్రీనివాసరావుతో "మా తండ్రిగారు" అని పరిచయం చేశాడు అతన్ని తీసుకువచ్చి. అతను ఏదో అన్నాడు. "మానాన్న గారు మిమ్మల్ని తన ఇంటికి వచ్చి పావనం చెయ్య మంటున్నారు" అన్నాడు. "టైముంటే రేపు చూద్దాం" అన్నాడు శ్రీనివాసరావు.

తిరిగి వచ్చాక ఖాజల్ భోజనం ఏర్పాటు చేసి పిలిచింది. భోజనం నేల మీద ఏర్పాటు చేసింది. శ్రీనివాసరావు కిష్టం అని తెలుసుకొని వెన్నలో పప్పు వండి నెసిక్ చేసింది. శ్రీనివాసరావు వడ్డించుకొన్నాడు.

"నీ భార్య తినదా?" అని శ్రీనివాసరావు అడిగితే తరువాత తింటుందని, కుర్దీ స్త్రీలకి అతిథులకు కడుపు నిండా తిండి పెట్టడం మించిన ఆనందం ఉండదని అన్నాడు షాహీన్.

శ్రీనివాసరావు బలవంతం చెయ్యగా నెసిక్‌లోని గరిటతో రెండు సార్లు నోట్లో వేసుకొని ఆ గరిట మళ్ళీ అందులో పెట్టింది. మజ్జిగ గిన్నెలోని మజ్జిగ కరిచి పెట్టుకొని తాగింది. ఇంక శ్రీనివాసరావు అవి మళ్ళీ ముట్టుకోక "నాకివాళ కొంచె ఆకలి తక్కువగా ఉంది" అన్నాడు భోజనం ముగించి. ఖాజల్ నొచ్చుకొంది.

భోజనం చేస్తున్నంత సేపు "కుర్దీలలో కన్యాశుల్కం వేల దీనార్ల దాకా ఉంటుందని తనది ప్రేమ వివాహం అనీ, తన భార్య తన స్నేహితుడి చెల్లెలనీ అందుకని తను కన్యాశుల్కం చెల్లించలేదని చెప్పాడు.

"అంతంత కన్యాశుల్కాలు ఎందుకున్నాయి?" అని అడిగాడు శ్రీనివాసరావు.

భార్య తన బంగారం పుట్టింట్లోనే పదిలపరుస్తుందని కన్యాశుల్కం డబ్బుతో సాధారణంగా బంగారం కొంటారని, అది, ఒకవేళ ఆమెకి భర్త విడాకులిస్తే ఆమెకి ఆధారమౌతుందని చెప్పాడు.

"నువ్వు కన్యాశుల్కం చెల్లించలేదు కదామరి నువ్వు ఈమెను విడిచిపెడ్తే ఏం చేస్తుంది?" అని అడిగాడు శ్రీనివాసరావు "మాలో చాలా మందికి ఒక భార్యమించి ఎక్కువ మంది భార్యలుండరు. నేను ఖాజల్‌ని విడిచిపెడ్తే మా నాన్నగారు మళ్ళీ నా మొహం చూడరు. ఎక్కడో కుసంస్కారులు కాని సాధారణంగా భార్యల్ని విడిచిపెట్టరు. పూర్తిగా అనివార్యమైన పరిస్థితుల్లో ఒకరికి విడాకులిచ్చిగాని మరొకరిని చేసుకోరు. ఒకర్నే కొనుక్కోలేని వారు నలుగుర్నెల్లా కొనగలరు! చాలామంది ఎన్నో సంవత్సరాలు ఉద్యోగం చేసి ఏ నలభయ్యో ఏటో పాతికేళ్ళ అమ్మాయిని చేసుకొంటారు. అప్పటికి గాని డబ్బు సమకూడదు కదా! యుద్ధంవల్లా, కన్యాశుల్కం వల్లా ఆడపిల్లలకి పెళ్ళి కావటం కష్టం. పెళ్ళి అరబ్బుదేశవాసుల మధ్యే జరగాలంటుంది చట్టం" అని వివరించాడు.

భర్త దుబాసీగా వ్యవహరించగా ఖాజల్ భారతదేశం గురించి తనకున్న సందేహాలు శ్రీనివాసరావు నడిగి తీర్చుకొంది. "హిందూ స్త్రీలు ధరించే గాజులు తనకి చాలా ఇష్టం" అని

చెప్పింది. శ్రీనివాసరావు తన భార్య ఇండియా వెళ్ళి పోవటం వల్ల తన దగ్గర ఆ వస్తువులు లేవని చెప్పాడు వెంటనే.

"దయచేసి నా భార్య మిమ్మల్ని వస్తువుల్నడిగినట్టు భావించ వద్దు" అని, షాహిన్ క్షమాపణలు చెప్పుకొనే ధోరణిలో చెప్పాడు.

భోజనానంతరం శ్రీనివాసరావుతో అతని థీసిస్ గురించి చర్చిస్తుండగా షాహిన్ తండ్రి వచ్చి ఒక్క మాట మాట్లాడకుండా గంట సేపు చేతులుకట్టుకొని కూర్చున్నాడు.

"ఆయన నీతో ఏదో మాట్లాడడానికి వచ్చినట్టున్నాడు. పాపం ఆయన పని చూడకూడదా?" అన్నాడు శ్రీనివాసరావు ఇబ్బందిగా.

"ఆయనకి నాతో పనిలేదు. కొడుకు గురువుకి ఆయన ఆవిధంగా గౌరవం చూపిస్తున్నాడు అంతే" అన్నాడు షాహిన్ అది సాధారణం అన్న ధోరణిలో.

ఇండియా శిష్యుల తండ్రులదాకా ఎందుకు శిష్యులు ఆ మాత్రం గౌరవం చూపిస్తే అల్ప సంతోషులైన గురువులు ఎంత సంతోషిస్తారో కదా! అనుకొన్నాడు శ్రీనివాసరావు.

షాహీన్ తండ్రి మరో అరగంట కూర్చుని మర్నాడు తమ ఇంటికి భోజనానికి రమ్మని శ్రీనివాసరావుని ఆహ్వానించి సెలవు తీసుకొని వెళ్లిపోయాడు.

మర్నాడు పొద్దున్న ఖాజల్ టీ డికాషన్‌లో బోలెడు పంచదార వేసి ఇచ్చింది షాహీన్‌కీ శ్రీనివాసరావుకి. శ్రీనివాసరావు ఇరాక్ వచ్చిన మొదటి రెండు నెలల దాకా అతనికి పాల పొడి దొరకలేదు. అందుచేత పాలు లేని నల్ల టీకి అలవాటు పడే ఉన్నాడు.

"రెండు నెలలు ఎంత ఇబ్బంది పడ్డానో తెలుసా! పాలపొడి డబ్బా ఒకటి కూడా దొరకలేదు" అన్నాడు శ్రీనివాసరావు షాహీన్‌తో సానుభూతినాసిస్తూ.

"అవును ఇరాక్‌లో పాల ఇబ్బంది చాలా పెద్దది. నిజాని కది ఇబ్బంది కాదు కరువు. మా రోజనీ తల్లిపాలు మానేశాక పాలు తాగిన రోజులు వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు" అన్నాడు షాహీన్. శ్రీనివాసరావు ఆసించిన సానుభూతి చూపించకుండా. ఇరాక్‌లో చంటి పిల్లలకే పాలు లేకపోతే తనకి పాలు లేవని ఎవరు సానుభూతి చూపిస్తారు! ఇన్నాళ్లు తనావిధంగా ఆలోచించ లేదు అనుకొన్నాడు శ్రీనివాసరావు.

పొద్దున్న తినడానికి రొట్టె 'మొసరు' (పెరుగు) 'తనియా' (విడిగా) తెచ్చారు. రొట్టె పెరుగులో ముంచుకు తిన్నాడు. అదో కొత్త అనుభవం. అతను మిగిల్చిన పెరుగు మళ్లీ ఖాజల్ ఫ్రిజ్‌లో పెట్టింది. తనకి ఇచ్చిన పెరుగు కూడా వాళ్లు రొట్టె ముంచుకొని తినగా మిగిలినది కాదు కదా!అని అప్పుడు శ్రీనివాసరావుకి అనుమానం వచ్చింది. ఇంకా ఆ ఊళ్లో ఉండి అక్కడ వారింట్లో మరో భోజనం చెయ్యలేక శ్రీనివాసరావు పనుందంటూ ఆర్బిల్ బయల్దేరాడు.

మార్చిలో మొదటి టర్మ్ పరీక్షలు పూర్తయ్యాయి. అప్పుడు శ్రీనివాసరావు పెట్టిన

పరీక్షకి షాహీన్ పావుగంట ఆలస్యంగా వచ్చాడు. నూటికి 55 మార్కులు తెచ్చుకొన్నాడు. పాస్ మార్కు 60. అంటే షాహీన్ ఆ పరీక్ష మళ్లీ సెప్టెంబర్‌లో వ్రాయాలి. దానికి సప్లిమెంటరీ పరీక్షాపత్రం తయారుచేసి డీన్‌కి ఇచ్చి శ్రీనివాసరావు ఇండియా బయల్దేరాడు. షాహీన్ పరీక్షలో ఇంపార్టెంటు ప్రశ్నలు తెలుసుకోటం కోసం తనని ఇంటికి పిలిచి మర్యాద చేశాడా? అన్న అనుమానం శ్రీనివాసరావును వదల లేదు. అయినా శ్రీనివాసరావు, షాహీన్ కు తను నిర్మొహమాటంగా ఏ సహాయం చేయలేదు. అంటే ఆ నెసిక్‌ని తన దగ్గర ఉడకనీయలేదు. అప్పుడు అది గుర్తుకు వచ్చి నవ్వుకొన్నాడు.

* * *

అతను తాగిచ్చిన గ్లాసులో మజ్జిగ పోసి అమ్మే కుర్రాడు మరొకళ్లకి ఇచ్చాడు. శ్రీనివాసరావు నవ్వుకొన్నాడు దాహం తీరింది. శ్రీనివాసరావు ఎక్కి కూర్చున్నాడు. బస్సు బయల్దేరింది. ఇరాన్‌బోర్డర్‌కి అతి దగ్గర్లో ఉన్న సులేమానియా ఊరుకి కొద్ది మైళ్ల దూరంలో ఉన్న ప్రాంతం గుండా బస్సు పోతోంది. దారి పక్కన మండుతున్న జీపులు, సిపాయిల శవాలు, క్షతగాత్రులతో నిండిన ట్రక్కులు కనిపించాయి. ఇరాక్‌లో బంకర్లలో సిపాయిలు, అడుగడుక్కి తగుల్తారు. ఎక్కుపెట్టిన తుపాకులతో సిద్ధంగా ఉంటారు. పొరపాట్న ఓ తుపాకి పేలి ఓ గుండు తగిలితే! శ్రీనివాసరావుకి భయంఉండేది. ఆ విషయంలో మొదట్లో అయితే అతనుంటున్న ఫ్లాట్‌కి దగ్గర్లో అనేక షెల్స్ అనేకసార్లు పడటంతో అలవాటు పడిపోయాడు. భయం పూర్తిగా తీరకపోయినా, అతనికి నిద్ర వస్తోంది. ఆ క్రితం రాత్రి కుర్దీ తిరుగుబాటు దారులకి ప్రభుత్వ సేనలకి భీకర పోరాటం జరిగింది. అతని ఫ్లాట్ పక్క నుంచి జనం పరిగెత్తుతున్న బూట్ల శబ్దాలు విని, బాత్‌రూమ్‌లోకి పోయి తలుపు వేసుకొన్నాడు. రాత్రంతా టాయిలెట్‌లోనే గడిపాడు. పొద్దున్నలేచి కర్టెన్లు తొలగించి చూస్తే ఎదురుగా మిలట్రీ ట్రక్ అందులో తుపాకీలు తన వైపే ఎక్కు పెట్టి కూర్చున్న సిపాయిలు కొందరు, టీ తాగుతున్న వారు కొందరు కనిపించారు. అంటే ఆ క్రితం రాత్రి ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో సిపాయిలు కుర్దీ తిరుగుబాటు దార్లని వెంటాడారన్నమాట. వీళ్లంతా శ్రీనివాసరావు లాంటి వారి రక్షణకి ఉండి పోయారన్నమాట.

రాత్రంతా ఆవిధంగా శ్రీనివాసరావుకి నిద్రలేదు. అంతకు ముందు మిలట్రీ ఆఫీసర్లు వచ్చి తిరుగుబాటుదార్లు అక్కడకి రావచ్చునని విదేశీయులందరు తలుపులు వేసుకొని భద్రంగా ఉండాలని హెచ్చరించారు. కాని హాస్టల్లో ఉన్న విద్యార్థులు "ఉస్తాదుల్ని మావాళ్లు ఎత్తుకుపోయినా హాని చెయ్యరు గౌరవంగా చూస్తారు. పోతే గాడిదల మీద కొండల్లోకి ప్రయాణం మాత్రం కొంచెంకష్టంగా ఉంటుంది" అని ఆటలు పట్టించారు.

శ్రీనివాసరావుకి కొంచెం తిక్కరేగింది. "ఇంకెన్నాళ్లు మీ ఆటలు, పదిరోజుల్లో పరీక్షలవగానే మిమ్మల్ని ప్రభుత్వం ఇరాన్ మీదకి యుద్ధానికి పంపుతుంది" అని సానుభూతి

లేకుండా అన్నాడు.

"మేము యుద్ధానికే వెళ్లాలని ఏమీ లేదు". అన్నాడందులో ఒకడు.

"ఏం చేస్తావ్?" అని అడిగాడు శ్రీనివాసరావు ఆశ్చర్యంగా.

"తిరుగుబాటు దారుల్లో జేరి పోతా" అన్నాడతను. యుద్ధం చెయ్యక ఎల్లాగో తప్పదు. అక్కడికి ప్రభుత్వం కోసం కాక తమ స్వాతంత్రం కోసమే పోరాడవచ్చు అన్నట్టుగ. అందులో భయం ధ్వనించలేదు. క్రోధం ధ్వనించింది.

ప్రభుత్వం వారి పల్లెల్ని నాశనం చేసినా, బంధువులమీద కెమికల్ బాంబులు వేసినా వారికి ప్రభుత్వం పట్ల వినయం ఏర్పడలేదు. బుద్ధి రాలేదు! తురకలందరు మొండివారే అనుకొన్నాడు శ్రీనివాసరావు. విసిరేసినట్టు పల్లెల్లో ఉండే కుర్దీలను పట్టణాలకి తరలించే ప్రయత్నంలో ప్రభుత్వం రాక్షసంగా ప్రవర్తించింది మరి.

పది రోజుల్లో ప్రయాణం పెట్టుకొని అతనికి గాడిదల మీద ఊరేగటం ఇష్టం లేదు. అప్రమత్తతో మేలుకొని గడిపాడా పదిరోజులు.

బస్సులో చల్లదనానికి, అంతకు ముందు రాత్రుల నిద్రలేమికి శ్రీనివాసరావు నిద్రలోకి జారుకొన్నాడు.

బస్సు సాయంత్రం అయిదు గంటలవుతుండగా బాగ్దాద్ చేరింది. బస్సు దిగి టాక్సిలో ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళాడు సామాన్తో శ్రీనివాసరావు.

అక్కడ ఎయిర్‌పోర్ట్‌లో శ్రీనివాసరావుకి షాహీన్, అతని తండ్రి కనిపించారు. వాళ్ళ వాళ్ళని ఎవరినో విమానం ఎక్కించడానికి వచ్చి తిరిగి వెళ్ళబోతూ కనిపించారు. శ్రీనివాసరావు సామాన్లు టాక్సీలో వేసి మేడ మీదకి చేరవెయ్యటంలో సహాయం చేశారు.

శ్రీనివాసరావు అందరికి పెప్సీలు కొన్నాడు. కస్టమ్స్‌లోకి ప్రవేశించడానికింకా అర్ధగంట వ్యవధి ఉంది.

"మీకు చాలా రోజులుగా ఒక విషయం చెప్దామనుకొని మీరు మరోలా అర్థం చేసుకొంటారేమోనని చెప్పలేదు, నాకు మీ సబ్జెక్టంటే చాలా ఇష్టం. కాని పరీక్ష బాగా వ్రాయలేదు. బహుశా ఫెయిల్ అయి ఉంటాను" అన్నాడు షాహీన్. "అయ్యావు!" అన్నాడు శ్రీనివాసరావు.

"అయినందుకు బాధ లేదు. కాని మీరు నేను చదవలేదనుకొని ఉంటారని బాధ. కాని చదివే అవకాశం లేకపోయింది ఆముందు రెండు రోజులు" అన్నాడు షాహీన్.

"ఎందుకని?"

" అదే చెప్తున్నాను. పరీక్షనాడు చెప్తే మీనుంచి మార్కులు ఆశించి చెప్తున్నానను కొంటారేమోనని చెప్పలేదు. పరీక్షకి రెండు రోజుల ముందర మా పినతండ్రి నలభైయేళ్ళవాడు

యుద్ధంలో చనిపోయాడు. అతని దేహం పరీక్ష ముందు రోజున మా ఊరు వచ్చింది. ఆ రాత్రంతా ఆ శవాన్ని పెట్టుకొని మసీద్‌లో కూర్చున్నాం. చుట్టాలందరూ వచ్చి పరామర్శిస్తూ ఉన్నారు. అందుకని చదవటం కుదరలేదు".

"పరీక్ష ఉందని చెప్పలేక పోయావా? మీ వాళ్ళకి తెలియదా?" అని విసుగ్గా అడిగాడు శ్రీనివాసరావు "ఇప్పుడు నేను ఏమీ చెయ్యలేను తెల్సుకదా!"

"తెల్సు. కాని పరీక్ష ఉందని చెప్పి వెళ్ళి పోవడానికి కుదరదు మాలో. చనిపోయిన వ్యక్తికి అతి సన్నిహితులు నువ్వింక వెళ్లవచ్చు అనేవరకు ప్రతీ వాళ్ళూ ఉండాలి. మా పిన్నికి పరీక్ష రోజు ఉదయం అంత దుఃఖంలోను నాకు పరీక్ష ఉందని గుర్తు వచ్చి నన్ను వెళ్లమంది పాపం. అప్పుడు బయల్దేరి ఇంటికి వెళ్ళి తయారై కార్లో బయల్దేరాను. కిర్‌కుక్ దగ్గర చెక్‌పోస్టు తెరిచాక గాని కిర్‌కుక్ వదలటానికి అవలేదు. అందుకే పరీక్షకి ఆలస్యమయ్యాను. మామూలుగా అయితే ముందు రోజు హాస్టల్లో పడుకొనేవాడిని. ఈ విషయాలు మీరు మా ఇంటికి వచ్చినప్పుడు చెప్దామనుకొని నేను సానుభూతిని కోరి చెప్తున్నట్టు మీరు అపార్థంచేసుకొంటారని చెప్పలేదు" అన్నాడు.

శ్రీనివాసరావు మొదటిసారి కుర్దీల నిబ్బరానికి చలించిపోయాడు. "అందుకేనా అన్నిరోజుల నల్లబట్టలు కట్టుకొని కాలేజికి వచ్చింది?" అనడిగాడు శ్రీనివాసరావు గుర్తుకు తెచ్చుకొని. "అవును అవి కూడా మా పిన్ని విడవమనే వరకు కట్టుకోవటం మా ఆచారం" అన్నాడు.

'ఇటు యుద్ధంలోను అటు తిరుగుబాటులోను మీ కుర్దీలు నాశనమైపోతున్నారు' అన్నాడు శ్రీనివాసరావు సానుభూతిగా.

"అవును మాకు ఈ ఆయిల్ వద్దు. దాని వల్ల వచ్చే డబ్బు వద్దు. ఈ యుద్ధం వద్దు. మేము శాంతియుతంగా బతికే జాతివాళ్ళం ఇదంతా ప్రభుత్వం మాకు కట్టబెడ్తున్నది ప్రగతి పేరున, మతం పేరున.

షాహీన్, తండ్రి మాటలను అనువదించి చెప్పాడు.

"అల్లా మా కెందుకో ఈ శిక్ష విధించాడు" అన్నాడతనే మళ్ళీ బాధగా.

దేవుడిమీద విశ్వాసంతో మంచి రోజులకి ఎదురు చూస్తున్న రెండు తరాల కుర్దీలని విడిచి కస్టమ్స్‌లో ట్రాలీ తోసుకొంటూ వెళ్ళాడు శ్రీనివాసరావు.

'ఇదే మన దేశంలో అయితే ప్రభుత్వాలు మారటానికి, స్కైలాబ్స్, మిస్సైల్స్, గ్రహాలు, గతులు తప్పటానికి నేతుల్తో పాలతో పూజలు యజ్ఞాలూ చేయిస్తారు మన స్వాములు. మనకి భయం లేదు' అనుకొన్నాడు శ్రీనివాసరావు భయంతో బాగ్దాదు వదుల్తూ. ఇరాకీలకి ఆ సదుపాయం లేనందుకు ఓ క్షణం విచారించాడు. ●

(రచన........1993)